క్లుప్తంగా

శివారెడ్డిపల్లిలో ఎల్లమ్మతల్లి ఉత్సవాలు



పూజలు చేసిన ఎమ్మెల్యే సతీమణి ఉమారెడ్డి

దోమ: శివారెడ్డిపల్లి గ్రామంలో శ్రీరేణుకా ఎల్లమ్మతల్లి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు చుట్టుపక్క గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి సతీమణి ఉమారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ చెన్నయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, గ్రామస్తులు మధుకర్‌రెడ్డి, అనంతరెడ్డి, పండరయ్య, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన పోలేపల్లి ఎల్లమ్మ దేవాలయం



అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలో నిలుచున్న భక్తులు

దుద్యాల: మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో స్వయంభూగా వెలసిన పోలేపల్లి ఎల్లమ్మ దేవాలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి రోజును పురస్కరించుకొని వివిధ గ్రామాల నుంచి 6వేలకుపైగా భక్తులు దర్శించుకున్నారు. ఇటీవలే అమ్మవారి జాతర కావడంతో భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తున్నారని, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటున్నారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మేకల సంతను సద్వినియోగం చేసుకోవాలి

ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

బంట్వారం: వ్యాపారులు, కొనుగోలుదారులు మేకల సంతను సద్వినియోగం చేసుకోవాలని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మేకల సంతను ఆయన సందర్శించి మాట్లాడారు. మేకల సంత ప్రారంభించిన మూడు వారాల్లోనే అభివృద్ధి పథంలో కొనసాగుతుందని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మేకల సంతలో నీటి తొట్టెలతో పాటు చుట్టూ ఫెన్సింగ్ వేయిస్తానని చెప్పారు. అంతకుముందు కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి మేకల సంతలో ఉదయం అల్పాహారం ఏర్పాటు చేయడంపై చైర్మన్ మహేందర్‌రెడ్డి అభినందించారు. అనంతరం చైర్మన్ మహేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మల్లేషయాదవ్‌ను మర్యాదపూర్వకంగా శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు యాదగిరి, శాకం నర్సింలు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుల్లో నిర్లక్ష్యం వహించొద్దు



రత్నానాయక్ తండా పాఠశాలలో విద్యార్థి సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకట్

దోమ: విద్యార్థులు చదువుల్లో నిర్లక్ష్యం వహించొద్దని ఎంఈఓ వెంకట్ పేర్కొన్నారు. శుక్రవారం దోమ మండల పరిధిలోని గూడూర్, దొంగఎన్కేపల్లి, శివారెడ్డిపల్లి, రత్నానాయక్ తండా పాఠశాలలను సందర్శించి పరిసరాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు తరగతుల వారీగా ఎఫ్ఏ1, ఎఫ్ఏ2, ఎస్ఏ1, ఎస్ఏ3 ఆన్‌లైన్లో ఎంట్రీ చేయాలన్నారు. బడీడు పిల్లల సమాచారం సేకరించి నెల నుంచి రాని విద్యార్థులను బడికి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. పదిలో మంచి ఫలితాలు తీసుకొచ్చేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బ్రహ్మణపల్లి కల్వర్టు పైనుంచి నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం (ఫైల్)



శిథిలావస్థకు చేరిన గొడుగోనిపల్లి కల్వర్టు

కల్వర్టులకు మోక్షమెన్నడో?

- శిథిలావస్థకు చేరిన బ్రహ్మణపల్లి, పాలేపల్లి, గొడుగోనిపల్లి వంతెన
- భారీ వర్షం కురిస్తే రాకపోకలకు అంతరాయం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు, రైతులు
- పట్టించుకోని అధికారులు

దోమ: అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల అలసత్వం ప్రయాణికుల పాలిట శాపంగా మారుతోంది. ఏళ్ల క్రితం నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారుతున్నాయి. ఎప్పుడు కూలిపోతాయేనని ప్రయాణికులు, రైతులు జంకుతున్నారు. నిత్యం ఆయా గ్రామాల వాహనదారులు వివిధ పనుల నిమిత్తం రాకపోకలు చేస్తున్నారు. అకాల వర్షాలు దంచి కొడితే కల్వర్టులు తెగిపోయే అవకాశం ఎక్కువ.

వంతెనపైనుంచి రాకపోకలు..

దోమ మండల పరిధిలోని బ్రహ్మణపల్లి, పాలేపల్లి, గొడుగోనిపల్లి గ్రామాల పరిధిలో రోడ్లపై వంతెనలు, కల్వర్టులు కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. అయితే అవీ ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుని కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. నిత్యం పరిగి పట్టణంతో పాటు ఆయా గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. శిథిలావస్థకు చేరుకున్న వంతెనలపైనుంచి ప్రయాణించే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు.

వర్షాలు కురిస్తే రాకపోకలు బంద్..

బ్రహ్మణపల్లి గ్రామ సమీపంలోని వంతెనపై పెద్ద గుంత ఏర్పడింది. అటుగా ప్రయాణించే ప్రయాణికులు గుంతలో పడి ప్రమాదానికి గురవుతున్నారు. భారీ వర్షం కురిస్తే వర్ష ధాటికి వచ్చే నీరు వంతెనపై నుంచి ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలకు అంతారాయం ఏర్పడుతుంది. అటు గొడుగోనిపల్లి గ్రామ సమీపంలోని కల్వర్టు సైతం అకాల వర్షానికి తెగిపోవడంతో ఇబ్బందులు తీవ్రంమవుతున్నాయి. దోమ, పాలేపల్లి మధ్యలో ఉన్న వాగు శిథిలావస్థకు చేరడమే కాకుండా భారీ వర్షాలు కురిస్తే వాగుపై నుంచి నీరు ప్రవహించి కాకారవాణి ప్రాజెక్టుకు వెళ్తుంది. దీంతో అటుగా ప్రయాణించే వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాలు రాకముందే సంబంధిత అధికారులు కల్వర్టులను మరమ్మతులు చేసి వంతెనల ఎత్తును పైకి పెంచే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చర్యలు చేపట్టాలి



శిథిలావస్థకు చేరిన వంతెనలు, కల్వర్టుల మరమ్మతులను సంబంధిత అధికారులు వెంటనే చేయించేలా చర్యలు చేపట్టాలి. వర్షకాలం ప్రారంభమైతే ప్రమాదకరంగా తయారైన వంతెనలపైనుంచి భారీగా నీరు ప్రవహిస్తుంది. దీంతో వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తుంది. వంతెనా పైభాగాలను ఎత్తుకు పెంచేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– రాఘవేందర్‌రెడ్డి, బ్రహ్మణపల్లి

వేతనాలు చెల్లించాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

దౌల్తాబాద్: గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలని శుక్రవారం పంచాయతీ కార్మికులు ఎంపీడీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల గ్రామ పంచాయతీ వర్కర్ల సంఘం అధ్యక్షుడు సాయిలు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ప్రతీ నెల ఒకటో తేదీన గ్రీన్‌చానల్ ద్వారా చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతీ నెల వేతనాలు సక్రమంగా అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే బకాయి వేతనాలను విడుదల చేయాలని కోరారు. గ్రామ పంచాయతీల ఫ్రీజింగ్ ఎత్తివేయాలని కోరారు. ఎండాకాలం దృష్ట్యా కార్మికులకు భద్రత కల్పించాలని, ఒంటి పూట పనికల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు హరిచందర్, బన్సిలాల్, వెంకట్‌రాములు, శంకరప్ప, దస్తప్ప, ఫకీరప్ప, మల్కప్ప తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేస్తే గుర్తింపు



సంధ్యారాణిని సన్మానిస్తున్న కార్యదర్శులు

డీఎల్‌పీఓ సంధ్యారాణి

కుల్కచర్ల: నిబద్ధతతో పనిచేస్తే ప్రజలు గుర్తిస్తారని డీఎల్‌పీఓ సంధ్యారాణి పేర్కొన్నారు. శుక్రవారం చౌడాపూర్ మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు గ్రామస్తుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, మురుగు వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నిబద్ధతతో పనిచేసే అధికారులను ప్రజలు గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు. శనివారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పంచాయతీ కార్యదర్శులు డీఎస్‌పీఓను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సోమలింగం, కార్యదర్శులు రాధ, స్వరూప, సుమలత, రేణుక, పరమేశ్వరి, కుతుబున్నిసా, రాజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సురేందర్, మహేశ్వర్ రెడ్డి, మహేష్, లాల్యా, రాఘవేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైల పుణ్యక్షేత్రానికి పాదయాత్ర



భక్తులతో మఠాధిపతులు వీరేశ్వర్ శివాచార్యులు

కొడంగల్ రూరల్: నారాయణఖేడ్, సంగారెడ్డి పరిసర గ్రామాల భక్తులు మూడు రోజుల క్రితం శ్రీశైల పుణ్యక్షేత్రానికి పాదయాత్ర ప్రారంభించారు. శుక్రవారం కొడంగల్ పట్టణానికి చేరుకున్న భక్తులు శ్రీమహాదేవుని ఆలయ ఆవరణలో విశ్రాంతి తీసుకున్నారు. ధనాసిరి మఠాధిపతులు వీరేశ్వర్ శివాచార్యుల ఆధ్వర్యంలో పాదయాత్రగా బయలుదేరుతున్నట్లు భక్తులు తెలిపారు. ప్రతీ ఏడాది మహాశివరాత్రి అనంతరం ధనాసిరి మఠం నుంచి పాదయాత్ర ప్రారంభిస్తున్నట్లు వారు తెలిపారు. సంగారెడ్డి, నారాయణఖేడ్, మొగంపల్లి తదితర గ్రామాలకు చెందిన దాదాపు 8వందల మందికి పైగా ప్రతీ ఏడాది పాదయాత్ర నిర్వహిస్తారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా మహాదేవుని ఆలయ ఆవరణలో వీరేశ్వర్ శివాచార్యుల స్వామివారు శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రవచనాలు అందించారు. భక్తితో దేన్నైనా సాధించవచ్చన్నారు. అనంతరం మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామ శివారులో వెలసిన శివాలయ ఆవరణలో మధ్యాహ్నం బస చేశారు. మాజీ సర్పంచు శ్రీనివాస్‌రెడ్డి భక్తులకు భోజన, నీటి వసతులు కల్పించారు. ప్రతీరోజు 30నుంచి 40కి.మీ వరకు నడుచుకుంటూ 12రోజుల్లో శ్రీశైల పుణ్యక్షేత్రానికి చేరుకుంటామని ఆయన తెలిపారు. ఇప్పటివరకు 30వ ఏడాది పాదయాత్రగా వెళుతున్నట్లు చెప్పారు.

ప్రశాంతత కోసం..

ప్రతీ ఏడాది పాదయాత్ర నిర్వహిస్తాం. దీంతో శరీర వ్యాయామం చేకూరడమే కాకుండా ఆరోగ్యంగా ఉండేందుకు ఆస్కారం ఉంటుంది. మఠాధిపతులు వీరేశ్వర్ శివాచార్యుల ఆధ్వర్యంలో గ్రామాల్లోని కుటుంబాలు పెద్ద ఎత్తున పాదయాత్రగా తరలి రావడం విశేషం.

దాహార్తిని తీర్చేవి చలివేంద్రాలు

మర్పల్లి తహసీల్దార్ మునీరొద్దీన్

మర్పల్లి: దాహార్తిని తీర్చేవి చలివేంద్రాలని మర్పల్లి తహసీల్దార్ మునీరొద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం మర్పల్లి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో స్థానిక నాయకులతో కలిసి ఆయన చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ఎండల దృష్ట్యా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే రైతులు, భూముల రిజిస్ట్రేషన్లు చేసుకొనేందుకు వచ్చే ప్రతీ ఒక్కరికి వేసవిలో ఇవి ఉపయోగపడుతాయన్నారు. వేసవిలో ఏ ఒక్కరూ కూడా తాగునీటి కోసం ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశంతో ప్రత్యేకంగా తమ కార్యాలయ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ మల్లేశ్‌యాదవ్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు సర్వేశ్, బీజేపీ జిల్లా కార్యదర్శి మల్లేశ్ యాదవ్, స్థానిక మాజీ సర్పంచ్ సలీం, రిపోర్టర్ నర్సింలు, రావులపల్లి కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రవి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



తుంకిమెట్ల పాఠశాలలో..

బొంరాస్‌పేట: మండల పరిధిలోని పలు పాఠశాలల్లో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. మండల కేంద్రంలో రేయిన్‌బో పాఠశాలలోని విద్యార్థులు అధికారులుగా, ఉపాధ్యాయులుగా ఒకరోజు విధులు నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌గా రాహుల్, డీఈఓగా సాయిశ్రీ, ఎంఈఓగా సాత్విక్, ప్రిన్సిపాల్‌గా సాహితీయాదవ్, ఉపాధ్యాయులుగా 36మంది విధులు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హైమత్, పార్వతి, స్వరూప తదితరులు పాల్గొన్నారు. మేడిచెట్టు తండా పాఠశాలలో.. ఎంఈఓగా సరళ, హెచ్‌ఎంగా సంజన, ఉపాధ్యాయులుగా రోహిణి, శివాజీ, హయతి రాథోడ్, గాయత్రి, ఇందు, నందు, అక్షిత విధులు నిర్వహించారు. వీరికి ఇందులో హెచ్‌ఎం వీణారాణి బహుమతులు అందజేశారు. తుంకిమెట్ల పాఠశాలలో.. హెచ్‌ఎంగా నవీన్, ఉపాధ్యాయులుగా 13మంది పాఠాలు బోధించారు.

ఆడపడచులకు అండగా కాంగ్రెస్

తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బషీరాబాద్: రాష్ట్రంలో ఆడపడచులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బషీరాబాద్ మండల కేంద్రంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు అందజేసి, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. మహిళల సాధికారిత కోసం ప్రభుత్వం కోటి మంది డ్వాక్రా మహిళలను కోటీశ్వరులను చేసేల చర్యలు చేపట్టిందన్నారు. డ్వాక్రా మహిళలు వ్యాపార రంగంలో రాణించేల అనేక సబ్సిడీ పథకాలు అందజేస్తున్నామని చెప్పారు. పెళ్లీడు వచ్చిన ఆడపడచులు తల్లిదండ్రులకు భారం కాకుండా కల్యాణలక్ష్మీ అందజేస్తున్నామన్నారు.

పథకాలన్నీ మహిళల పేరిటే..

ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు మహిళల పేర్లమీదనే అమలుచేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మహాలక్ష్మీ, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత వంటి పథకాలు వారిపేరిటే అమలు చేస్తున్నట్లు చెప్పారు. అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి మహిళల చేతికే అప్పగించామని గుర్తు చేశారు. రాజకీయంగానూ మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. గ్రామాల్లో ఇంకా డ్వాక్రా సంఘంలో లేని మహిళలు సంఘాల్లో చేరాలని సూచించారు. అనంతరం తాగునీటిపై అధికారులతో సమీక్షించారు. గ్రామాల్లో ఎక్కడ తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. కార్యదర్శులు ప్రతీ రోజు గ్రామాల్లో పర్యటించి ప్రజాసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం ఉపాధిహామీ సామాజిక ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ కింద చేపడుతున్న రోడ్డు పనులు నెలాఖరులోపు పూర్తి చేయాలని ఇంజనీర్లకు, అధికారులకు సూచించారు. పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మాధవరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ చందర్ పాల్గొన్నారు.

లైంగికదాడి నిందితుడిని పట్టుకోవాలి: కేవీపీఎస్

యాలాల: జగిత్యాల జిల్లాలో ఇటీవల దళిత ఆశావర్కర్‌పై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య డిమాండ్ చేశారు. గత నెల 27న జగిత్యాల జిల్లా రాయికల్‌లో శివరాత్రి రోజు డ్యూటీ ముగించుకొని వెళుతున్న దళిత ఆశావర్కర్‌ను భయపెట్టి ఓ కామాంధుడు ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడని తెలిపారు. బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి వదిలేశారని, ఇప్పటి వరకూ నిందితుడిని పట్టుకోలేదని మండిపడ్డారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళా ఉపాధ్యాయుల్ని సన్మానించిన అధికారులు, ఉపాధ్యాయులు

కొడంగల్ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ సవిత సంజీవ్

కొడంగల్ రూరల్: వివిధ రంగాల్లో విజయాలు సాధించిన మహిళలను ఆదర్శంగా తీసుకొని అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని కొడంగల్ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్‌ఓ) సవిత సంజీవ్ సూచించారు. శుక్రవారం పట్టణ శివారులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆమె విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థి దశ ఎంతో కీలకమన్నారు. లక్ష్యం దిశగా చదువుతూ ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు కృషిచేయాలన్నారు. క్రమశిక్షణ, విద్యతోనే సమాజంలో గౌరవం దక్కుతుందన్నారు. అనంతరం ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, ఫుడ్ ఫెస్ట్‌ను ప్రారంభించారు. స్వయం ఉపాధి గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రఫియాఖానం, ఉమెన్ ఎంపవర్‌మెంట్ కన్వీనర్ ఎం.హరిప్రియ, అన్నపూర్ణ, ఐక్యూఏసీ సమన్వయకర్త టి.రాంబాబు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించడం సంప్రదాయం

ధారూరు: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, మహిళలను గౌరవించడం సంప్రదాయమని ధారూరు ఎంపీడీఓ నర్సింహులు పేర్కొన్నారు. ధారూరులోని శుభం ఫంక్షన్ హాల్లో శుక్రవారం మండలంలోని మహిళా ఉపాధ్యాయులను అధికారులు, ఉపాధ్యాయులు శాలువా కప్పి పూలమాలలు వేసి, జ్ఞాపిక అంద జేసిసన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందన్నారు. విద్యార్థులకు విద్యాదానం చేస్తున్న వారి అంకితభావాన్ని అభినందించాల్సిందేనన్నారు. అనంతరం ధారూరు మండలం నుంచి వికారాబాద్ మండలానికి బదిలీ అయిన ఎంఈఓ బాబుసింగ్‌కు శాలువా కప్పి, పూలమాల వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు రమేశ్ బసిరెడ్డి, వెంకట చంద్రశేఖర్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



పరిగి: సన్మానిస్తున్న అధ్యాపక బృందం

పరిగిలో..

పరిగి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. మహిళా అధ్యాపకులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ సునీతా పద్మావతి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యాపకులు విజయలక్ష్మీ, అంజమ్మ, అధ్యాపకులు విల్సన్, గంగాధర్, నర్సింహారెడ్డి, సంపత్, జనార్దన్, సాయిలప్ప, ఆంజనేయులు, మహేశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• మిషన్‌భగీరథ నీటి సరఫరాలో అంతరాయం

దౌల్తాబాద్: దౌల్తాబాద్ మండలానికి సరఫరా అయ్యే మిషన్‌భగీరథ పైప్‌లైన్ లీకేజీ వల్ల మండలంలో శుక్రవారం నుంచి శనివారం వరకు నీటి సరఫరాలో అంతరాయం కలుగుతున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్, మిషన్‌భగీరథ ఏఈ వినయ్‌రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ గమనించి సహకరించాలని కోరారు.

• చిన్నారి చికిత్సకు ఆర్థిక సాయం

యాలాల: అరుదైన కాలేయ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి వశిష్ట చికిత్సకు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. యాలాల మండలంలోని సంగెంకుర్దు గ్రామానికి చెందిన భానుప్రియ, శివకుమార్ దంపతుల 9 నెలల బాలుడు వశిష్ట బైలెరియా అట్రేసై అనే అరుదైన కాలేయ వ్యాధితో బాధపడుతున్నాడు. కాలేయ మార్పిడికి రూ.22లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో విషయం తెలుసుకున్న ఆర్‌బీఎల్ ఫ్యాక్టరీ ఎండీ, కాంగ్రెస్ సీనియర్ నేత బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి, సరళ దంపతులు శుక్రవారం చిన్నారి తండ్రిని ఇంటికి పిలిపించుకుని రూ.50వేల సాయం అందజేశారు. చిన్నారి చికిత్సకు కోసం ప్రతిఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

• సమస్యలు పరిష్కరిస్తాం

మోమిన్ పేట్: కస్తూర్బా గాంధీ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చంద్రాయన్ పల్లి కస్తూర్బా గాంధీ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు వచ్చే దారిని సీసీ రోడ్డుగా వేయిస్తానన్నారు. విద్యార్థులకు సరిపడా తాగునీటినీ సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ప్రత్యేక అధికారి సదానందం, ఎంఈఓ మల్లేశం, పాఠశాల ప్రత్యేక అధికారి, నాయకులు సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

• బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

పరిగి: శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు, ఎమ్మెల్యే సతీమణి ఉమా రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ నెల 9, 10, 11 తేదీల్లో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. మూడు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలకు ఆయా మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారని పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గోపాల్, శ్రీనివాస్, సురేఖ, బాబయ్య, చిన్న నర్సింహులు, వెంకటేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

• పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

కొడంగల్ రూరల్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను శుక్రవారం ఎస్ఐ జీవి.సత్యనారాయణ అందజేశారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్ కార్యాలయ ఆవరణలో బాధితులకు పంపిణీ చేశారు. కొడంగల్‌కు చంద్రశేఖర్‌కు, డి.రాజుకు, చెన్నకేశవులు, కస్తూర్‌పల్లికి చెందిన మహ్మద్ అఫ్జల్, చిట్లపల్లికి చెందిన బిచ్చప్ప, మైసమ్మతండాకు చెందిన శంకర్, రేగడిమైలారానికి చెందిన చైతన్య, ఐనన్‌పల్లికి చెందిన నర్సిములుతోపాటు మరో ఇద్దరికి సెల్‌ఫోన్లు అందజేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో 10ఫోన్లను పోలీసులు రికవరీ చేసి బాధితులకు అందజేశారు.

• పరీక్షలపై దృష్టి పెట్టాలి

కుల్కచర్ల: పదోతరగతి విద్యార్థులు పరీక్షలపై దృష్టి పెట్టాలని కుల్కచర్ల ఎంపీడీఓ రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని కేజీబీవీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కొన్ని రోజుల్లో పదోతరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు ఎలాంటి ఆలోచనలు లేకుండ పరీక్షలపై దృష్టి సారించాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో మనస్సును పరీక్షలపై కేంద్రీకరించి చదువుకోవాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలలోని బియ్యం తదితర వంట సామగ్రిని పరిశీలించారు. భోజనం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి అవకాశం ఇవ్వొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

• ముగిసిన స్వచ్ఛ శక్తి వారోత్సవాలు

బొంరాస్‌పేట: మండలంలో ఈ నెల 2 నుంచి 8వరకు నిర్వహించిన స్వచ్ఛ శక్తి వారోత్సవాలు గురువారం ముగిశాయి. ముగింపు కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు హాల్లో మహిళా దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మంగమ్మ, ఎంపీడీఓ హరినందనరావు పలువురు మహిళా ఎంపీటీసీలను, సర్పంచులను సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేశ్యానాయక్, ఎంపీటీసీ ప్రమిలాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

• ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

అనంతగిరి: వికారాబాద్ ఎన్నెపల్లి పరధిలోని తోట్ల ఎల్లమ్మ తల్లి సహిత పరుశురామ నాగ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం నుంచి ప్రత్యేక పూజలతో ప్రారంభించారు. ఇందులో భాగంగా ఉదయం గోపూజ, ధ్వజారోహణం చేశారు. అనంతరం మంటప ప్రవేశం, గౌరి పూజ, హోమం చేసి ప్రత్యేక హారతి ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

• డైరీ ఆవిష్కరణ

అనంతగిరి: తెలంగాణ హెల్త్ ఎడ్యుకేటర్స్ అండ్ మీడియా ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రచురించిన నూతన డైరీని శుక్రవారం డీఎంహెచ్‌ఓ వెంకటరమణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్, మండల వైద్యాధికారులు పాల్గొన్నారు.